సాక్షి అనకాపల్లి

గురువారం । 16 । మే । 2024



హెచ్‌ఎంలకు షోకాజ్

మనబడి నాడు నేడు ఫేజ్ 2 పనుల్లో జాప్యానికి బాధ్యులైన 227 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

10లో



టీటీడీకి రూ.10 లక్షల విరాళం

విశాఖ: ఆధ్యాత్మికవేత్త హిమాంశు ప్రసాద్ కుటుంబం తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డికి రూ.10 లక్షల విరాళం అందజేసింది.

గరిష్టం/కనిష్టం
34.3/26.0

వాతావరణం

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు. ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి చందనం విక్రయాలు



సింహాచలం: చందనోత్సవం రోజు వరాహ లక్ష్మీనృసింహస్వామి నుంచి స్వీకరించిన చందనాన్ని ఈ నెల 16, 17, 19, 20, 21 తేదీల్లో విక్రయించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సుమారు 10 గ్రాముల చందనం ప్యాకెట్‌ను రూ.10కి విక్రయిస్తామన్నారు. సింహగిరిపై ప్రసాదాల విక్రయశాల వద్ద ఉదయం ప్యాకెట్ల విక్రయం ఉంటుందని, భక్తులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఏయూ ఈఈటీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కోర్సుల్లో సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏయూ ఈఈటీ 2024 ప్రవేశాల కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. రక్షణ రంగ ఉద్యోగులు, దివ్యాంగుల విభాగాల వారికి ఈ నెల 17న ప్రత్యక్షంగా సర్టిఫికెట్ల పరిశీలన జరుపుతారు. ఎన్‌సీసీ, క్రీడా విభాగాల వారు తమ సర్టిఫికెట్లను ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు అప్‌లోడ్ చేయాలని, ఇతర విభాగాల విద్యార్థులు ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ. నాయుడు సూచించారు. ఈనెల 25 నుంచి 29 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తొలిదశ సీట్ల కేటాయింపు జూన్ 1వ తేదీన నిర్వహిస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు జూన్ 3 నుంచి 10వ తేదీ వరకు నిర్ణీత ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గురుకులాల్లో ఇంటర్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

- నేడు బాలురకు, రేపు బాలికలకు నిర్వహణ

కంచరపాలెం (విశాఖ): ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్ సీట్ల భర్తీకి ఈ నెల 16, 17 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలో 3 గురుకులాలు, అనకాపల్లి జిల్లా పరిధిలో 8 గురుకులాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయించారు. బాలురకు 183 సీట్లు కేటాయించగా.. శ్రీకృష్ణాపురం, దేవరాపల్లిలో ఎంపీసీ/బైపీసీ, సబ్బవరం, గొలుగొండలో ఎంఈసీ/సీఈసీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బాలికలకు 183 సీట్లు కేటాయించగా.. మధురవాడ, మేహాద్రిగెడ్డ, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి, నక్కపల్లి, నర్సీపట్నం, కోనాంలో ఎంపీసీ/బైపీసీ గ్రూపులకు ఈ నెల 17న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

భువనేశ్వర్-యల్లహంక సమ్మర్ స్పెషల్

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్ ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉన్నందున భువనేశ్వర్-యల్లహంక- భువనేశ్వర్ మధ్య (వయా దువ్వాడ మీదుగా) సమ్మర్ స్పెషల్స్ నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. భువనేశ్వర్-యల్లహంక(02811) సమ్మర్ స్పెషల్ ప్రతీ శనివారాలలో భువనేశ్వర్‌లో రాత్రి 7.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.55 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11.55 గంటలకు యల్లహంక చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో యల్లహంక-భువనేశ్వర్(02812) సమ్మర్ స్పెషల్ ప్రతీ సోమవారాలలో యల్లహంకలో ఉదయం 5 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.32 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 12.15గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 3వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు నడుస్తాయి. ఈ స్పెషల్ రైళ్లు 16–థర్డ్ ఏసీ, 2–జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తాయి.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు స్వల్ప అస్వస్థత

మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గురువారం విధి నిర్వహణలో ఉండగా డాక్టర్ పి.అశోక్‌కుమార్‌కు గుండెనొప్పి వచ్చింది. కేజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన చికిత్స కోసం కేర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ కోలుకుంటున్నారు. గతంలో ఆయనకు గుండెనొప్పి రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. కొద్ది రోజుల విశ్రాంతి తర్వాత తిరిగి విధుల్లో చేరారు.

దుశ్శాసన పర్వం

రాత్రి వేళ జుత్తు పట్టుకొని లాక్కొచ్చారు.. కాళ్లతో తన్నుకుంటూ.. తాకరాని చోట తాకుతూ.. దుస్తులు చింపేశారు. అడ్డు వచ్చిన వారిని గాయపరిచారు. ఫోన్లు, ఒంటిపైనున్న బంగారు వస్తువులు లాక్కెళ్లారు. నర్సీపట్నంలో ఒంటరి మహిళపై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడి అనుచరులు జరిపిన దాష్టీకమిది. వలంటీర్‌గా సేవలందించడమే ఆమె చేసిన పాపమట.. వలంటీర్ వ్యవస్థను ఎన్నికల ప్రక్రియకు దూరం చేయడంతో రాజీనామా చేసి, ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పనిచేయడమే ఆమె దోషమట.. అందుకే దుశ్శాసనుల్లా ఆమెను ఈడ్చుకొచ్చారు. వివస్త్రను చేశారు. ఈ ఘటనతో సభ్యసమాజం సిగ్గుతో తలదించుకుంది. 'గాంధీ గారి దేశంలో గజానికో గాంధారి కొడుకు' తయారయ్యాడని.. వారికి అడ్డుకట్ట వేసేందుకు దశ 'దిశ' నిర్దేశించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నా.. ఆయన ఆశయాల కోసం పని చేస్తున్నవారన్నా ఎందుకంత కక్ష, కార్పణ్యం.

- నర్సీపట్నంలో పచ్చ మూకల అమానుషం
- పూర్వ మహిళా వలంటీర్‌పై పాశవికంగా దాడి
- జుత్తుపట్టుకొని లాక్కొచ్చి, దుస్తులు చించేసిన అయ్యన్న అనుచరులు
- ఎన్నికల్లో చురుగ్గా పనిచేశారన్న కోపంతో దుశ్చర్య
- నిందితులు రెడ్డిసాయి, రెడ్డి రాజేష్, గంగాధర్‌లపై పోలీసులకు ఫిర్యాదు
- ఏరియా ఆస్పత్రిలో బాధితురాలికి వైద్యం



విశాఖ సిటీ : వలంటీర్లంటే వారికి ఒళ్లు మంట. సేవలతో ప్రజలకు దగ్గరవుతున్నారని, సీఎం జగన్ ప్రతినిధులుగా ప్రజలు వారిని ప్రేమిస్తున్నారని ద్వేషం. వారి వల్ల రాజకీయంగా తాము బలహీన పడుతున్నామని కడుపు మంట. అందులో మహిళా వలంటీరంటే మరింత చులకన. అందుకే నర్సీపట్నం మండలం ధర్మసాగరంలో పూర్వ వలంటీర్ పొలమూరి రాజకుమారిపై మంగళవారం రాత్రి అయ్యన్నపాత్రుడి అనుచరులు కీచకపర్వానికి తెగబడ్డారు. రాజకుమారికి భర్త లేడు. 13 ఏళ్ల కుమారుడితో ఆమె ఒంటరిగా జీవిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్‌గా చేరారు. సీఎం వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా మనసారా సేవలందించారు. చంద్రబాబు అండ్ కో ఫిర్యాదులతో వలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు దూరం పెట్టమన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మనస్తాపం చెంది రాజీనామా చేశారు. ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించారు. పోలింగ్ రోజున ఓటర్లకు స్లిప్‌లు రాసిచ్చి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేయడం టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడి అనుచరులకు మింగుడు పడలేదు. అదే గ్రామానికి చెందిన టీడీపీ జెడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ అనుచరులు రెడ్డి రాజేష్, రెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి శివ, సుకల రాజేష్‌తో పాటు మరికొందరు రాజకుమారిని టార్గెట్ చేశారు.

తప్పిన ప్రాణాపాయం

పోలింగ్ మరుసటి రోజు మంగళవారం రాత్రి రాజకుమారి పడుకునేందుకు తన 13 ఏళ్ల కుమారుడిని వెంట పెట్టుకొని అదే గ్రామంలో ఉన్న అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లారు. రాత్రి 10 గంటల సమయంలో టీడీపీ మూకలు రెడ్డి రాజేష్, రెడ్డి సత్యసాయి, కామిరెడ్డి శివ, సుకల రాజేష్, పెట్ల గంగాధర్, అల్లు రాజు, వానపల్లి రాజేష్, సార్ల రఘు, నందిపల్లి బోయిల నాయుడు వారి ఇంటి మీదకు ఎగబడ్డారు. రాజకుమారిపై దాడి చేశారు. వారి చర్యలను ఆమె సెల్‌ఫోన్‌లో చిత్రీకరించేందుకు ప్రయత్నించడంతో ఆమె చేతిలో ఉన్న మొబైల్‌ను లాక్కొని జుట్టు పట్టుకొని బయటకు ఈడ్చుకొచ్చారు. ఛాతి మీద చేయి వేసి విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. ఆమె ఒంటి మీద బట్టలను చించేసి వివస్త్రను చేశారు. మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. రాజకుమారిపై దాడిని అడ్డుకోవడానికి స్థానిక యువకులు, మహిళలు ప్రయత్నించారు. టీడీపీ నేతలు వారిపై కూడా దాడి చేసి గాయపరిచారు. దీంతో ఒమ్మి గోవింద, గజ్జల గోపీచంద్, వియ్యపు వరహాలు, గుమ్మిడి సీతమ్మలకు కూడా గాయాలయ్యాయి. రాజకుమారిని రక్షించడానికి ప్రయత్నించిన వృద్ధురాలు సీతమ్మ చెంపపై గట్టిగా కొట్టి ఆమె బంగారు చెవి దుద్దులు లాక్కొని వెళ్లిపోయారు. ఒంటరిగా ఉంటే చంపేసే వారని, అమ్మ వాళ్ల ఇంటి వద్ద ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డానని రాజకుమారి చెప్పారు. ఈ ఘటనపై ఆమె నర్సీపట్నం రూరల్ పోసులకు ఫిర్యాదు చేసి, తనకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు దాడికి పాల్పడిన వారిపై 324, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

మూడంచెల పటిష్ట భద్రత



స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన ఈవీఎంలు.. పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



స్ట్రాంగ్ రూమ్ వద్ద పహారా కాస్తున్న కేంద్ర బలగాలు

- స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు భద్రం
- కేంద్ర బలగాలు, పోలీసులతో పటిష్ట బందోబస్తు
- సీసీ కెమెరాల ద్వారా 24 గంటల నిఘా
- చుట్టుపక్కల ప్రాంతాల్లో 144 సెక్షన్
- లెక్కింపు జరిగే వరకు నిరంతర పహారా

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎస్పీ కార్యాలయం సమీపంలోని ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. జిల్లాలో మొత్తం 1,529 పోలింగ్ కేంద్రాల్లో వినియోగించిన ఈవీఎంలతోపాటు 3,666 బీయూ, సీయూ యూనిట్లు, 3,968 వీవీ ప్యాట్ మిషన్లను ఇక్కడ భద్రపరచి అభ్యర్థుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మంగళవారం స్ట్రాంగ్ రూమ్‌నకు సీల్ వేయించారు. ఇక్కడ మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్, రాష్ట్ర స్థాయిలో ఆర్మ్‌డ్ ఫోర్స్, స్థానిక సివిల్ పోలీస్ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయి. స్ట్రాంగ్ రూమ్ మొదటి సర్కిల్‌కు కేంద్ర బలగాల గార్డులు కాపలాగా ఉన్నారు. రెండో సర్కిల్‌లో ఆర్మ్‌డ్ పోలీసు బృందం, మూడో సర్కిల్‌లో జిల్లాల కార్యనిర్వాహక దళానికి చెందిన గార్డులను మోహరించి ఉంచారు. ఈ బలగాలు 24 గంటలు స్ట్రాంగ్ రూమ్ చుట్టూ పహారా కాస్తున్నాయి. స్ట్రాంగ్ రూమ్ ముందు భాగంలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేసి, దాని భద్రతను పర్యవేక్షిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను నిర్ధారించడానికి ఒక పోలీసు అధికారి, ప్రభుత్వ అధికారి అన్ని సమయాల్లో విధుల్లో ఉంటారు.

సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ

స్ట్రాంగ్ రూమ్ చుట్టూ సీసీ కెమెరాల పర్యవేక్షణ 24 గంటలు ఉంటుంది. కాబట్టి స్ట్రాంగ్ రూమ్ భద్రతలో విద్యుత్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల నిరంతర విద్యుత్ సరఫరా తప్పనిసరి. విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రధాన ఎన్నికల అధికారి విద్యుత్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా జనరేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు.

డబుల్ లాకింగ్ సిస్టమ్‌తో పటిష్ట భద్రత

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం స్ట్రాంగ్ రూమ్‌గా ఉండే గదికి ఒకే తలుపు ఉండాలి. గదిలోనికి చేరుకోవడానికి వేరే మార్గం ఉండకూడదు. గదిలో డబుల్ లాక్ సిస్టమ్ ఉంటుంది. ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలను ఇక్కడ ఉంచిన తర్వాత స్ట్రాంగ్ రూమ్‌కు తాళం వేసి, సీల్ చేస్తారు. తాళం చెవులు మూడు సెట్లుగా స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జ్, కలెక్టర్, ఎస్పీల వద్ద ఉంటాయి. వర్షం, వరద వస్తే నీరు సులభంగా బయటకు వెళ్లే విధంగా స్ట్రాంగ్ రూమ్‌ను తయారు చేస్తారు. నీరు లోపలికి రాకుండా ఎత్తులో ఉండే గదిని ఎంచుకుంటారు. అగ్ని ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్తలు పాటిస్తారు.



ఈవీఎంలను భద్రపరచిన భవనం

జిల్లాలో పోలింగ్ శాతం 83.84

- తుది జాబితా విడుదల చేసిన జిల్లా ఎన్నికల యంత్రాంగం

తుమ్మపాల: జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ శాతాల తుది జాబితాను జిల్లా ఎన్నికల యంత్రాంగం మంగళవారం రాత్రి విడుదల చేసింది. తొలుత విడుదల చేసిన వివరాలకు, దీనికి స్వల్ప వ్యత్యాసం ఉంది. ఆరు శాసనసభ నియోజకవర్గాల్లో 10,81,042 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 83.84 శాతం పోలింగ్ నమోదయింది. జిల్లాలో మొత్తం ఓటర్లు 12,89,371 మంది ఉన్నారు. వీరిలో స్త్రీలు 6,62,022 ఉండగా 5,54,924 మంది ఓటు వేశారు. పురుషులు 6,27,321 ఉండగా 5,26,106 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 12 మంది ట్రాన్స్‌జెండర్స్ కూడా ఓటు వేశారు. ఈ లెక్కన ఆరు నియోజకవర్గాలను పరిశీలిస్తే పురుషుల కన్నా స్త్రీలే అధికంగా తరలి వచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు. జిల్లా మొత్తం మీద పురుషుల కంటే 28,818 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు.

తుది జాబితా ప్రకారం

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	స్త్రీలు	పురుషులు	శాతం
చోడవరం	2,17,484	1,84,026	94,874	89,148	84.62
మాడుగుల	1,88,989	1,62,580	83,796	78,784	86.03
అనకాపల్లి	2,13,714	1,70,582	88,526	82,053	79.82
యలమంచిలి	2,06,394	1,77,376	90,999	86,376	85.94
పాయకరావుపేట	2,50,744	2,06,626	1,04,214	1,02,411	82.14
నర్సీపట్నం	2,12,016	1,79,852	92,515	87,334	83.76
మొత్తం	12,89,371	10,81,042	5,54,924	5,26,106	83.84

మాడుగుల విద్యార్థుల ప్రతిభ

మాడుగుల రూరల్: ఏపీఆర్‌ఎస్, ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో మాడుగుల విద్యార్థులు సత్తా చాటారు. ఏపీఆర్‌ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో పెదపూడి త్రిపుర 6వ ర్యాంకు సాధించింది. ఈమె స్థానిక సెయింటాన్స్ పాఠశాలల్లో పదో తరగతి చదివింది. అలాగే ఏపీఆర్‌జేసీలో వేపాడ పూర్ణచంద్రరావు(మాడుగుల జెడ్పీ హైస్కూలు) రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంకు, ఏడాకుల పావని(మాడుగుల జెడ్పీ హైస్కూలు) 51 ర్యాంకు, కటకం జయంత్ (సెయింటాన్స్ స్కూలు) 184 ర్యాంకు, దాసరి రామచరణ్ 342 ర్యాంకు, తామరపల్లి హేమన్య 670 ర్యాంకు, చింతపల్లి హైమావతి 1043 ర్యాంకు సాధించారు. వీరంతా మాడుగుల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివారు. ఈ నెల 20న గుంటూరులో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కానున్నారు.



ఏపీఆర్‌ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు సాధించిన త్రిపురను అభినందిస్తున్న దృశ్యం

మామిడీలా..!

వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మామిడి దిగుబడి ఈ ఏడాది గణనీయంగా తగ్గిపోయింది. ఆశించిన ధర ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. మరో వైపు మామిడి రాకపోవడంతో కమీషన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ నెలాఖరు వరకు మామిడి సీజన్ ఉంటుంది. డిసెంబరు నాటికి పూత రావాల్సి ఉన్నప్పటికీ ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కూడా రాలేదు. దీంతో మామిడి పంట దిగుబడి తగ్గింది. రైతులతో పాటు, లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టే కమీషన్ వ్యాపారులు కూడా నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఈ ఏడాది గణనీయంగా తగ్గిన దిగుబడి
- ధర ఉన్నా.. ఫలితం శూన్యం
- వెలవెలబోతున్న కమీషన్ దుకాణాలు



ఎగుమతికి సిద్ధం చేసిన మామిడి పండ్లు

నక్కపల్లి :

గ్రామీణ జిల్లాలో సుమారు 35 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 6 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ లెక్కన ఏటా సుమారు 2 లక్షల టన్నుల దిగుబడి రావాలి. ఉద్యానవన శాఖాధికారులు మాత్రం 75 నుంచి 80 శాతం దిగుబడినే పరిగణనలోకి తీసుకుంటారు. జిల్లాలో మామిడి సాగులో పాయకరావుపేట నియోజకవర్గానిదే అగ్రస్థానం. నక్కపల్లి మండలంలో 10 వేల ఎకరాలు, కోటవురట్ల మండలంలో 7 వేల ఎకరాలు, పాయకరావుపేట మండలంలో 4 వేల ఎకరాలు, ఎస్.రాయవరం మండలంలో 6 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. తర్వాత పద్మనాభం మండలంలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. నాతవరం, కొయ్యూరు, నర్సీపట్నం, గొలుగొండ, యలమంచిలి, రాంబిల్లి, మాడుగుల, కోటపాడు, చోడవరం మండలాల్లో దాదాపు 5 వేల ఎకరాల్లో మామిడి పండిస్తున్నారు. ప్రతి ఏటా జిల్లా నుంచి లక్ష టన్నుల పైనే ఎగుమతి జరిగేది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో సగానికి సగం దిగుబడి పడిపోయిందని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు. సీజన్ పూర్తయ్యే నాటికి 50 వేల టన్నుల ఎగుమతి చేయడం కష్టమేనని అంటున్నారు.

హైవే పక్కనే కమీషన్ దుకాణాలు

జిల్లాలోనే మామిడి సాగులో అగ్రస్థానంలో ఉన్న పాయకరావుపేట నియోజకవర్గంలో వేంపాడు, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ రహదారి పక్కన కమీషన్ దుకాణాలు ఎక్కువగా ఏర్పాటు చేస్తుంటారు. ఇక్కడ 14 వరకు దుకాణాలు ఏర్పాటు చేసి ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, ఒడిశా, హైదరాబాద్, బెంగళూరు, కటక్, విశాఖపట్నం, విజయవాడ, చెన్నై తదితర ప్రాంతాలకు మామిడి కాయలు, పండ్లను కూడా ఎగుమతి చేస్తుంటారు. డిసెంబరు నుంచే ఇక్కడ కమీషన్ వ్యాపారులు తమ దుకాణాలు తెరిచి చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటలను కొనుగోలు చేయడం.. రైతులకు పెట్టుబడుల కోసం అడ్వాన్సులు చెల్లిస్తుంటారు. వేంపాడు, చినదొడ్డిగల్లు కాగిత ప్రాంతాల నుంచి ఏటా సీజన్ ముగిసే నాటికి సుమారు 20 నుంచి 30 వేల టన్నులకు పైగా మామిడి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. గతంలో రోజుకు 500 నుంచి 800 టన్నులు ఎగుమతి అయ్యేది. ఈ ఏడాది మాత్రం రోజుకు 100 నుంచి 200 టన్నులకు మించి ఎగుమతి చేయడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కొక్క దుకాణం నుంచి గతంలో 10 టన్నుల వ్యాన్లు రోజుకు పది వరకు పంపించేవారమని, ఇప్పుడు 3 టన్నుల సామర్థ్యం కలిగిన బొలేరో వాహనాలను రోజుకు పది మాత్రమే పంపించగలుగుతున్నామని వారు చెబుతున్నారు.

ధర సూపర్

ఈ ఏడాది మామిడి ధర చాలా బాగుంది. బంగినపల్లి ధర టన్ను రూ.40 వేలు ఉంది. సువర్ణరేఖ రూ.50 వేల నుంచి 60 వేల వరకు ఉంది. కలెక్టర్ రకం రూ.23 వేల వరకు ఉంది. ఇక రసాలు, కోలంగోవా వంటి పండ్ల రకాల ధరలు రూ.35 వేలు పైబడే ఉంది.

పెట్టుబడులు రావడం కష్టమే..

పదెకరాల మామిడి తోటను ఏడాది ఫలసాయం కోసం రూ.1.50 లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తారు. పురుగు మందులు పిచికారీ, ఎరువులు తదితర వాటి కోసం మరో రూ.50 వేల వరకు ఖర్చు చేస్తారు. తీరా ఇంత పెట్టుబడి పెట్టినా దిగుబడి మాత్రం అంతంత మాత్రంగానే ఉందని రైతులు వాపోతున్నారు. వర్షాలు పడకపోవడం, పొగ మంచు, బొడ్డుపుచ్చు పురుగు కారణంగా దిగుబడి రాలేదని చెబుతున్నారు. వచ్చిన కాయలు కూడా నాణ్యతతో ఉండడం లేదని అంటున్నారు.



చినదొడ్డిగల్లు వద్ద ఏర్పాటు చేసిన కమీషన్ దుకాణం



చినదొడ్డిగల్లు కమీషన్ దుకాణం వద్ద అరకొరగా వచ్చిన మామిడికాయలు

లీజు డబ్బులూ వచ్చేటట్టు లేదు..

లక్షల పెట్టుబడి పెట్టి మామిడి తోటలు లీజుకు తీసుకొన్నాం. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. లీజు డబ్బులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మామిడితో పాటు, జీడి పరిస్థితి కూడా అలాగే ఉంది. ఈ ఏడాది పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కమీషన్ దుకాణాలకు కాకుండా టోకు పద్ధతిలో రైతుబజార్లకు వెళ్లి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. – **ఎస్.వి.రమణ, రైతు**

ప్రతికూల పరిస్థితులతో నష్టాలు

ఏటా లక్షలాది రూపాయలు పెట్టి మామిడి తోటలు కొనుగోలు చేస్తున్నాం. కమీషన్ దుకాణాలు ఏర్పాటు చేశాం. ప్రతికూల పరిస్థితుల వల్ల దిగుబడి రాక నష్టాలు చవిచూస్తున్నాం. దుకాణాలు ఏర్పాటు చేసి రెండు నెలలు గడుస్తున్నా వెయ్యి టన్నులు ఎగుమతి చేయలేని పరిస్థితి నెలకొంది.

– **తోట సత్తిబాబు, మామిడి వ్యాపారి**

క్లుప్తంగా

మీ ఆదరణ మరిచిపోలేను..

- నా గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: పాయకరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బుధవారం అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నాలుగు నెలల కిందట నియోజకవర్గంలో ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన తన పట్ల ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు ప్రత్యేక ఆదరణ చూపారన్నారు. పోలింగ్ రోజున తనకు ఓటు వేయించేందుకు పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామని ఓటర్లు పోటెత్తారన్నారు. కోవిడ్ కష్ట కాలంలో కూడా సంక్షేమ పథకాలు ఆపకుండా ఆదుకున్న వైఎస్ జగన్ మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినప్పుడే అవినీతి రహిత పరిపాలన సాధ్యమవుతుందని ప్రజలు గుర్తించారన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 82 శాతం ఓట్లు పోలయ్యాయన్నారు. మహిళలు పార్టీ గెలుపు కోసం స్పష్టమైన ఓటింగ్ సరళిని కనబరిచారన్నారు. విద్య, వైద్యంలో పెనుమార్పులు తీసుకురావడంతో ఓటర్లలో చైతన్యం పెరిగిందన్నారు. బడుగు బలహీన వర్గాలు తనకు ఓటు వేసి అండగా నిలిచారని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో జూన్ 4న వచ్చే ఫలితాల్లో భారీ మెజార్టీతో గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, ఎస్.రాయవరం కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

హలో.. ఏంటి పరిస్థితి!

- పార్టీ, అభ్యర్థుల గెలుపు, ఓటములపై ఆరా
- ఎక్కడ చూసినా ఇదే చర్చ
- కూడికలు, తీసివేతల్లో శ్రేణులు నిమగ్నం
- లెక్కలు, అంచనాల్లో తలమునకలు



సాక్షి, విశాఖపట్నం: హలో.. అప్పారావ్!.. నేను రాజుబాబుని మాట్లాడుతున్నాను. ఏంటి పరిస్థితి? మీ దగ్గర ఎవరు గెలుస్తారు? ఎన్ని ఓట్ల మెజార్టీ వస్తుందనుకుంటున్నారు? అవతల పార్టీ అభ్యర్థికి ఎన్ని పడుంటాయ్? అయితే మన పార్టీ కేండిడేట్ గెలుపు గ్యారంటీ అన్న మాట! అది సరే.. స్టేట్‌లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనుకుంటున్నారు? నీకున్న సమాచారం ఓ సారి చెప్పు!' అని అడిగే సరికి ఆ రాజుబాబు తనకు తెలిసినవి కొన్ని, తెలియనివి మరికొన్నింటిని జోడించి అక్కడ వాళ్లు గెలుస్తున్నారు.. ఇక్కడ వీళ్లు గెలుస్తున్నారంటూ టక టకా చెప్పేస్తున్నాడు. మధ్యమధ్యలో అప్పారావుకొచ్చిన డౌట్‌లను నివృత్తి చేస్తూ ఫలితాలను ముందే ప్రకటిస్తున్నాడు. ఇలాంటి అప్పారావులు, రాజుబాబుల్లాంటి వారు చాలామంది ఈ పనిమీదే ఉన్నారు. ఎక్కడ చూసినా ఇలాంటి చర్చలే సాగిస్తున్నారు. పోలింగ్ ముగిశాక అభ్యర్థులు, పార్టీల గెలుపోటములపైనే అందరి దృష్టి ఉంది. ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ కనిపిస్తోంది.

అంతేకాదు.. ఎక్కడెక్కడో ఉన్న వారు సైతం తమ స్నేహితులు, బంధువులకు ఫోన్లు చేసి ఎన్నికల ఫలితాలెలా ఉంటాయన్న దానిపైనే మాట్లాడుకుంటున్నారు. సాధారణ ప్రజలకంటే ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలు వీటిపైనే చర్చించుకుంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులకు ఎన్ని ఓట్లు పోలై ఉంటాయి? వాటిలో గెలుపు అంశాలు ఎంతవరకు ఉంటాయన్న దానిపై బేరీజు వేస్తున్నారు. మహిళలు, పురుషులు, వృద్ధులు, యువతీ యువకులు ఎవరికి వేశారోనని ఆరా తీస్తున్నారు. దానిని బట్టి ఫలానా అభ్యర్థి/పార్టీ గెలుస్తుందని, లేదా ఓటమి పాలవుతారని అంచనాకొస్తున్నారు. ఇలా కూడికలు, తీసివేతల్లో నిమగ్నమై ఉన్నారు. లెక్కలు, అంచనాల్లో తలమునకలై ఉన్నారు. మరోవైపు టీవీల్లోను, సోషల్ మీడియాలోను, యూట్యూబ్ ఛానల్స్‌లోనూ ఇప్పటికే అనధికారికంగా ఎగ్జిట్ పోల్స్ పేరిట ఏ పార్టీకి ఎన్ని సీట్లొస్తాయన్నది జోస్యం చెప్పేస్తున్నారు. ఆయా పార్టీల శ్రేణులు, రాజకీయాలపై ఆసక్తి ఉన్న వారు వీటిని ఎక్కువగా వీక్షిస్తున్నారు. కొన్ని యూట్యూబ్ ఛానల్స్‌లో ఈ ఎన్నికల్లో తమదే శాస్త్రీయమైన సర్వే అని చెప్పుకుంటూ తమ అభిమాన పార్టీకి అనుకూలంగా ఫలితాలను ఇస్తున్నారు. మరికొందరైతే అధికార వైఎస్సార్‌సీపీకి అనుకూల ఫలితాలనే కూటమికి వస్తున్నట్టు తారుమారుగా చూపిస్తున్నారు. ఇలా సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌లో వ(ఇ)స్తున్న అనధికార అంచనా ఫలితాలు జనాన్ని గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి. దీంతో తమ నమ్మకస్తులకు ఫోన్లు చేసి సందేహ నివృత్తి చేసుకుని ఒకింత ఊరట చెందుతున్నారు. వ్యతిరేక ఫలితాలు వస్తాయన్న సంగతి తెలిస్తే ఆందోళనకు గురవుతున్నారు. టీవీలు, సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌లో వస్తున్న సొంత అంచనాల ఫలితాలతో ఇప్పటికే బెట్టింగులకు దిగిన వారు మరింత టెన్షన్ పడుతున్నారు.

బెట్టింగులపై కూటమిలో బెరుకు..

మరోవైపు పోలింగ్‌కు ముందు కూటమి అభ్యర్థులదే గెలుపంటూ పందాల కోసం హడావుడి చేసిన వారు ఇప్పుడు వెనక్కి తగ్గారు. తొలుత 1:2,3 బెట్టింగులకు సిద్ధమన్న వారిప్పుడు 1:1కి కూడా ముందుకు రావడం లేదు. ఏదోలా తామే అధికారంలోకి వస్తామని బీరాలు పలుకుతున్నా.. పందాల దగ్గరకు వచ్చే సరికి పలాయనం చిత్తగిస్తున్నారు. మొత్తమ్మీద అసలు ఫలితాలు వెలువడే జూన్ నాలుగో తేదీ వరకు ఇలాంటి ఊహాగానాలకు తెరపడే అవకాశం లేదు.

2,08,329 మంది ఓటింగ్‌కు డుమ్మా

- నమోదైన ఓటింగ్ శాతం 83.84
- మొత్తం ఓటర్లు 12,89,371 మంది

యలమంచిలి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 2,08,329 మంది ఓటింగ్‌కు డుమ్మా కొట్టారు. వీరిలో పురుషులు 1,01,215 మంది కాగా, మహిళలు 1,07,098 మంది ఉన్నారు.

జిల్లాలో థర్డ్ జెండర్ కేటగిరీలో మొత్తం 28 మంది ఓటర్లు ఉండగా 12 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొంత మంది ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయకపోవడంతో రెండు చోట్ల ఓటు హక్కును కలిగి ఉన్నారు. దీంతో అలాంటి వారు జిల్లాలో ఓటు వేయడానికి రాలేదు. మరికొంత మంది ఉపాధి నిమిత్తం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లారు. అధిక శ్రమ పడాల్సి రావడంతో వారంతా ఓటు వేసేందుకు ఆసక్తి చూపలేదు. మిగిలినవారు నిరాసక్తత,ఇతర కారణాలతో ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. వేసవి సెలవులు కూడా కొందరు ఓటర్లు ఓటింగ్‌కు రాకపోవడానికి కారణంగా తెలుస్తోంది.ఇక జిల్లాలో మత్స్యకార గ్రామాలకు చెందిన వేలాది మంది ఒడిశా రాష్ట్రానికి వలస వెళతారు. వీరిలో కొందరు మాత్రమే ఓటువేయడానికి వచ్చారు.ముఖ్యంగా పట్టణ ఓటర్లు అధికంగా ఉన్న అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరంలలో అధికశాతం మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. నిజానికి గ్రామీణ ప్రాంత ఓటర్లతో పోలిస్తే పట్టణ ప్రాంత ఓటర్లకు ఓటింగ్‌పై కొంత అవగాహన ఎక్కువ.కానీ మెజార్టీ ఓటర్లు ఓటును హక్కు అనుకున్నారే తప్ప బాధ్యతగా భావించ కాలేదు. ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ఓటర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంది. ఈ కార్యక్రమాలను పలు చోట్ల తూతూమంత్రంగా నిర్వహించడంతో ఫలితం ఇవ్వలేకపోయాయని పలువురు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు స్వీప్ కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు.పట్టణ,గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రతిరోజు కళాబృందాలతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి కానీ అవేవీ సక్రమంగా నిర్వహించలేదనే విమర్శలున్నాయి.

జిల్లాలో ఓటింగ్ తీరు ఇలా..

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు
పురుషులు	6,27,321	5,26,106
మహిళలు	6,62,022	5,54,924
ఇతరులు	28	12
మొత్తం	12,89,371	10,81,042

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున, ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లు రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

విశాఖపట్నం–నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపూర్ – సికింద్రాబాద్ (07036) సమ్మర్ స్పెషల్, సంత్రగచ్చి – చెన్నై ఎగ్మోర్ (06080) స్పెషల్ ఆలస్యంగా బయలుదేరాయి.

227 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

- నాడు నేడు పనుల్లో జాప్యంపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ చర్యలు

నక్కపల్లి: మనబడి నాడు నేడు ఫేజ్ 2లో పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యంపై రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో నాడు నేడు కింద మౌలిక సదుపాయాల కల్పనలో జరుగుతున్న జాప్యానికి బాధ్యులైన 227 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర కమిషనర్ సూచనల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ డీఈవో వెంకటలక్ష్మమ్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాడు నేడు ఫేజ్ 2 కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో మేజర్, మైనర్ మరమ్మతులతోపాటు, మరుగుదొడ్లు, వంట షెడ్లు, తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనుల్లో ఇప్పటి వరకు 50 శాతం కూడా పూర్తి కాలేదు. గత ఏడాది చివరలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సైతం జిల్లాలో విస్తృతంగా పర్యటించి అసంపూర్తిగా ఉన్న పనులను పరిశీలించి సంబంధిత ఉపాధ్యాయులు, డీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎంల బ్యాంకు ఖాతాల్లో నిధులు ఉన్నప్పటికీ పనులు చేయకుండా జాప్యం చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. హెచ్‌ఎంలతోపాటు ఇంజనీరింగ్ అధికారులపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ పనుల్లో జాప్యం కొనసాగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు బాధ్యులైన హెచ్‌ఎంలపై కొరడా ఝళిపించారు. షోకాజ్ నోటీసులు జారీ అయిన వారిలో అనకాపల్లి మండలంలో 23 మంది, అచ్చుతాపురం మండలంలో 9 మంది, బుచ్చెయ్యపేటలో 6, చీడికాడలో 6, చోడవరంలో 15, దేవరాపల్లిలో ముగ్గురు, గొలుగొండలో 5, కె.కోటపాడులో 5, కశింకోటలో 6, కోటవురట్లలో 1, మాకవరపాలెంలో 9, మునగపాకలో 4, నక్కపల్లిలో 12, నర్సీపట్నంలో 21, నాతవరంలో 8, పరవాడలో 7, పాయకరావుపేటలో 24, రాంబిల్లిలో 9, రావికమతంలో 13, రోలుగుంటలో 5, ఎస్.రాయవరం మండలంలో 11, సబ్బవరం మండలంలో ఒకరు, వి మాడుగులలో ఐదుగురు, యలమంచిలి మండలంలో 14 మంది హెచ్‌ఎంలు ఉన్నారు. అలాగే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.



రాజయ్యపేట స్కూల్లో నాడు నేడు పనులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రవీణ్ ప్రకాష్ (ఫైల్)

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో యువకుడు ఉరి వేసుకొని బుధవారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెచ్‌సీ అప్పలకొండ అందించిన వివరాల ప్రకారం.. బంగారయ్యపేటలోని బీసీ కాలనీకి చెందిన మదిని గోవింద (28) పెంకుటింట్లో దూలానికి చీరతో ఉరి పోసుకొని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. మృతుడు ఈనెల 13 ఉదయం 8 గంటలకు ఓటు వేయడానికి ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకపోవడంతో తల్లి రాము బుధవారం వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఉన్నాడు. అతను అదే పనిగా మద్యం మత్తులో ఉంటాడని స్థానికులు హెచ్‌సీకి తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ అప్పలకొండ తెలిపారు.



గోవింద (ఫైల్)

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి–యలమంచిలి రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ అందించిన వివరాల ప్రకారం.. విజయవాడ–అనకాపల్లి మార్గంలో నరసింగబిల్లి వద్ద గుర్తు తెలియని రైలు నుంచి ఒక వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. నేరేడు పండు రంగుపై పచ్చ రంగు నిలువు చారల చొక్కా, నలుపు రంగు ఫుల్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అవి చిరిగి ఉన్నాయి. ఇవి తప్ప ఎటువంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి బంధువుల కోసం భద్రపరిచామని ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ కోసం తుని రైల్వే పోలీసు స్టేషన్‌నులో గాని, 9494887786, 9490619020 సెల్ నంబర్లు గాని సంప్రదించాలని తెలిపారు.



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

లాభాల సిరి.. జీడి మామిడి

- దిగుబడి తగ్గినా..రేటు బాగుండటంతో రైతుల్లో ఆనందం
- 80 కిలోల బస్తా రూ. 9 వేలు

ఎండనక.. వాననక చెమటోడ్చి శ్రమించే అన్నదాత తన సాగు ఫలప్రదమై.. ఏ కాస్త లాభం కళ్లజూసినా కొండంత సంబరపడిపోతాడు. అయితే ప్రతిసారీ అలా జరగదు. ప్రతికూల వాతావరణం.. అకాల వర్షాలు.. తదితర సమస్యల వల్ల రైతన్న నష్టపోతూనే ఉంటాడు. అయితే ఈ ఏడాది అదృష్టం బాగుండి.. సకాలంలో వర్షాలు పడకపోయినా.. జీడిమామిడి రైతులు సంతోషంగానే ఉన్నారు. దీనికి కారణం.. వాతావరణం అనుకూలించకపోయినా దిగుబడి ఆశించిన మేర లేకపోయినా రేటు బాగుండటంతో కర్షక మారాజులు సంబరపడుతున్నారు.

నాతవరం: ఈ ఏడాది జీడి పిక్కల రేటు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పంట దిగుబడి రైతులు ఆశించిన విధంగా లేకపోయినప్పటికీ రేటు మాత్రం బాగుంది. ప్రస్తుతం మార్కెట్లో జీడి పిక్కలు 80 కేజీల బస్తా నాణ్యతను బట్టి రూ. 8,700 నుంచి రూ. 9 వేల వరకు పలుకుతోంది. జిల్లాలో వరి పంట తర్వాత రైతులు అధికంగా సాగు చేసేది జీడిమామిడినే. జిల్లాలో 24 మండలాల్లోని 58 వేల ఎకరాల్లో జీడి మామిడి సాగు చేస్తున్నారు. నాతవరం, రోలుగుంట, నక్కపల్లి, కోటవురట్ల, గొలుగొండ, రావికమతం, బుచ్చెయ్యపేట, మాడుగుల, ఎస్.రాయవరం మండలాల్లో అధికంగా జీడి మామిడి పంట సాగులో ఉంది. మిగతా మండలాల్లో ఓ మోస్తరుగా ఈ పంట సాగు చేస్తున్నారు. నాతవరం మండలంలో జిల్లాలోనే అధిక విస్తీర్ణంలో జీడి తోటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో జీడి పూత నెల ఆలస్యమై పెట్టుబడికి తగ్గట్టు దిగుబడులు రాలేదని రైతులంటున్నారు.

మార్చి నుంచి మే నెలాఖరు వరకు.. అంటే సుమారు మూడు నెలలు జీడిమామిడి సాగుకు అనువైన కాలం. ఇతర పంటలతో పోల్చుకుంటే జీడి మామిడి తక్కువ పెట్టుబడితో అధికాదాయం అందజేస్తుంది. ఎకరా విస్తీర్ణంలో పెద్ద జీడి మామిడి చెట్ల వల్ల నాలుగు నుంచి ఐదు బస్తాల దిగుబడి వస్తుంది. తోట సంరక్షణ, దుక్కి ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీల ఖర్చు అన్నీ కలిపి ఎకరాకి రూ. 8 నుంచి 10 వేలు ఖర్చవుతుంది. ప్రభుత్వం కూడా ఉద్యానవన శాఖ ద్వారా జీడి రైతులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తోంది. సీజనల్‌గా జీడి తోటలకు వచ్చే తెగుళ్ల నివారించేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు సూచనలందిస్తోంది. దీంతో పాటు వైఎస్సార్ రైతు భరోసా పథకంలో పెట్టుబడి కింద ఆర్థిక సాయం చేస్తోంది. జాబ్ కార్డు ఉన్న రైతులు ఉపాధి హామీ పథకంలో జీడితోటల్లోని గట్లు పటిష్టం చేయటం, తుప్పలు తొలగించడం వంటి పనులు ఉచితంగా చేయడంతో రైతులకు పెట్టుబడి బాధలు తగ్గాయి.



ఎండలో ఆరబోసిన జీడి పిక్కలు (ఇన్‌సెట్) పంట దశలో ఉన్న జీడి పిక్కలు

గ్రామంలోనే కొనుగోలు..

రైతులు పండించిన జీడి పిక్కలను ప్రైవేట్ వ్యక్తులు రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. గతంలో కొందరే జీడి పిక్కలు కొనుగోలు చేయడంతో రైతులు ఇబ్బంది పడేవారు.

ఇప్పుడు ఆ బాధ లేదు. ఈ ఏడాది జీడి రైతులకు ఇతర పంటల కంటే జీడి పంట ఆదాయం బాగుంది.

దిగుబడి తగ్గినా.. రేటు బాగుంది..



ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు ఆశించిన విధంగా లేకపోయినా జీడి పిక్కలు మాత్రం బాగానే కాసాయి. పెద్ద తోటల కంటే హైబ్రీడ్ దిగుబడులు బాగున్నాయి. కొన్ని ప్రాంతాల్లో జీడి పంట దిగుబడి తగ్గినా రేటు బాగుండటంతో ఆ లోటు భర్తీ అవుతుంది.

– లాలం లోవ, జిల్లేడుపూడి గ్రామం

గ్రామంలోనే కొనుగోలు..



జీడి పిక్కలు అమ్ముకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా మా గ్రామంలోనే వ్యాపారులు డబ్బులిచ్చి కొనుగోలు చేస్తున్నారు. గతంలో తూకం కాటాలో రాళ్లు పెట్టి కొనుగోలు చేసేవారు. దానిలో మోసం ఉండేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఎలక్ట్రానిక్ యంత్రాలపై జీడి పిక్కలు కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల మోసపోయే అవకాశం లేదు.

– రెడ్డి వరహాలబాబు, నాతవరం గ్రామం

చీటీల పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

మునగపాక : చీటీల పేరుతో మోసం చేసిన మండలంలోని వాడ్రాపల్లికి చెందిన కొయిలాడ సత్యనారాయణను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు తెలిపారు. సత్యనారాయణ స్థానికంగా చీటీలు నిర్వహిస్తూ ఉండేవారు. వాడ్రాపల్లి, నాగవరం, కుంచవానిపాలెం, మల్లవరం, మునగపాక తదితర ప్రాంతాలకు చెందిన వారితో నమ్మకంగా చీటీలు నిర్వహించేవాడు. ఇతని మాటలు నమ్మిన పలువురు సత్యనారాయణ వద్ద చీటీలు కట్టేవారు. అయితే చీటీల సమయం ముగిసినా నగదు ఇవ్వకపోవడంతో పలుమార్లు సత్యనారాయణను నిలదీశారు. అయినప్పటికీ సత్యనారాయణ నుంచి చీటీల నగదు రాకపోవడంతో బుధవారం తెల్లవారి తమ చీటిల సొమ్ము తమకి ఇవ్వాలని అతన్ని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రసాదరావు వాడ్రాపల్లికి చేరుకుని సత్యనారాయణను మునగపాక పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. వాడ్రాపల్లికి చెందిన దాడి భాస్కరరావుతో పాటు మరో ఏడుగురు బాధితులు చీటీల ద్వారా తమకు రూ. 25 లక్షలకు పైగా నగదు ఇవ్వాల్సి ఉందని, న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి సత్యనారాయణను రిమాండ్‌కు తరలించారు. కాగా బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

వాతావరణ పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలి



కొరడా తెగులు



చెరకులో పీక పురుగు

అనకాపల్లి : రాగల వర్షాలను రైతులు వినియోగించుకుని చెరకు పంటకు నేల తయారు చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు చెరకులో పీక పురుగు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మీ.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మీ.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే 90 రోజుల వయసు గల పంటకు ఎకరాకు 75 కిలోల యూరియా, 45 రోజుల వయసు గల కార్సి చేసిన పైరుకు ఎకరాకు 150 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలన్నారు. చెరకులో విశ్వమిత్ర వంటి రకాలలో కొరడా తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందని, తెగులు గమనించినట్లయితే ప్రాపికొనజోల్ 1 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. ఖరీఫ్‌కు ముందుగా పచ్చి రొట్ట వేసుకోవాలనుకునే రైతులు జనుము (12–15 కిలోలు, ఎకరాకి), జీలుగ (10–12 కిలోలు ఎకరాకి), పిల్లిపెసర(10–12 కిలోలు ఎకరాకి), పెసర (8–10 కిలోలు ఎకరాకి) పచ్చిరొట్ట పైరు వేసుకోవచ్చన్నారు. మట్టి నమూనాలను సేకరించి విశ్లేషణకు అనుగుణంగా ఎరువులు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. తొలకరి వర్షాలను ఉపయోగించుకుని దుక్కులు దున్నుకుంటే తేమ సంరక్షించబడి పంటలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భూమి లోపల పొరల్లో కోసస్త దశల్లో ఉండే పురుగులకు సూర్యరశ్మి తాకడం వలన మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సూరిశెట్టి రమణఅప్పారావు

అనకాపల్లి: తాజా ఎన్నికల్లో 123 అసెంబ్లీ, 21 ఎంపీ సీట్లలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, సీఎంగా జగన్ విశాఖలో ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో చాలామంది ఓటర్లు తమ ఓటుకోసం సరైన అవగాహన లేక పోలింగ్ స్టేషన్ల చుట్టూ తిరిగేవారని, ఓటర్లలో చైతన్యం రావడంతో ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో బారులు తీరారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓటర్లు మరోసారి ప్రభుత్వాన్ని ఆశీర్వదించినట్లు కనిపిస్తోందన్నారు. ఈ సారి ఎన్నికల్లో అత్యధికంగా మహిళా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏడువాకల నారాయణరావు, రాపేటి మహాలక్ష్మినాయుడు, పి.కృష్ణపరమాత్మ, సత్యనారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలకు వినతి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో మత్తు వ్యవస్థ విముక్తి విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల 9 నెలల బకాయి జీతాలు తక్షణమే విడుదల చేయాలంటూ వైద్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు ఉద్యోగులు బుధవారం వినతిపత్రం అందించారు. కాంట్రాక్టర్ అగస్టు 2023 నుంచి గౌరవవేతనాలు చెల్లించట్లేదని, ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వ దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎల్.శ్రీను, రాజ్యలక్ష్మి, క్రాంతికుమార్, చంద్రశేఖర్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కామేశ్వరమ్మ పండగ

మాకవరపాలెం: మండలంలోని రాచపల్లి జంక్షన్‌లో కామేశ్వరమ్మతల్లి పండగను గురువారం నిర్వహించనున్నారు. పండగ సందర్భంగా భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా అమ్మ వారి పండగను స్థానికులు ఘనంగా నిర్వహిస్తారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈ సారి పండగకు భారీ ఏర్పాట్లు చేశారు.

అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	: రాజా
లక్ష్మీకటాక్షం	: సత్యనారాయణస్క్రీన్-1
కింగ్‌డమ్‌ప్లానెట్ అఫ్ ఏపీఈఎస్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటే అడక్కు	: పర్తిసాయి
ప్రతినిధి	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 954 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	--	--
మొదటి రకం	4,430	5,000
రెండో రకం	3,800	4,420
మూడో రకం	3,300	3,750

రక్త నిల్వలు

జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 339 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధిలో ఆదర్శం

- సుమారు రూ.10 కోట్లతో 81వ వార్డులో పలు అభివృద్ధి పనులు
- రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వైద్యానికి ప్రాధాన్యం
- అభివృద్ధి పట్ల ఆనందంలో వార్డు ప్రజలు



జీవీఎంసీ బాలికోన్నత పాఠశాల



నాడు-నేడులో ఆహ్లాదకరంగా రూపుదిద్దుకున్న గవరపాలెం హైస్కూల్



గవరపాలెం చిన్న హైస్కూల్లో ఆధునిక మరుగుదొడ్లు



80, 81 వార్డు పరిధి యూపీహెచ్‌సీ



ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

అనకాపల్లి: అనకాపల్లి మున్సిపాలిటీని గ్రేటర్ విశాఖలో విలీనం చేసి ఏళ్లు గడిచినా.. 81వ వార్డు గత ప్రభుత్వంలో కనీస అభివృద్ధికి నోచుకోలేదు. దాదాపు 25 వేల జనాభా ఉన్న ఈ వార్డు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే అభివృద్ధికి నోచుకుంది. సుమారు రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. వార్డు పరిధిలో ఆరు సచివాలయాలను ఏర్పాటుచేసి, ప్రభుత్వ సేవల్ని ప్రజలకు చేరువ చేశారు.

వార్డులో ప్రధాన అభివృద్ధి పనులు

- 80, 81 వార్డుకి అనుసంధానం చేస్తూ అరుంధతినగర్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నూతన భవనాన్ని రూ.కోటితో నిర్మించారు.
- పీలా గోవింద్ ఇంటి ముందు రహదారి, ఆదిభేతాళ స్వామి రహదారులను రూ.30 లక్షలతో నిర్మించారు.
- రూ.20 లక్షలతో బాలాజీరావుపేట, కస్పావీధి, జగన్నాథ్ థియేటర్ ఏరియాలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.
- అరటిపండ్లు, కూరగాయల మార్కెట్‌లో రైతులకు సౌకర్యంగా ఉండేందుకు రూ.20 లక్షలతో షెడ్లు నిర్మించారు.
- రూ.20 లక్షలతో బాలాజీరావుపేటలో పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేశారు.
- రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం చుట్టూ రూ.50 లక్షలతో ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు.
- రూ.2 కోట్లతో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు.
- వార్డు పరిధిలో 7 స్కూళ్లను రూ.3.10 కోట్లతో స్మార్ట్ స్కూల్స్‌గా అభివృద్ధి చేశారు.
- వార్డు పరిధిలో అర్హులైన 1,050 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను మండలంలోని కోడూరు సర్వే నెం.1లో 750 మందికి, మామిడిపాలెంలో 300 మందికి అందించారు.
- 467 మంది లబ్ధిదారులకు మండలంలోని సత్యనారాయణపురం టిడ్కో గృహాలను ఉచితంగా కేటాయించారు. ఇప్పటికే కొందరు గృహప్రవేశాలు కూడా చేసుకున్నారు.
- రూ.20 లక్షలతో దిబ్బవీధిలో తాగునీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు.
- వేసవి దృష్ట్యా రూ.5 లక్షలతో 16 మినీ వాటర్ ట్యాంకులకు మరమ్మతులు చేపట్టి, ప్రజల వినియోగంలోకి తీసుకొచ్చారు.
- మరో రూ.2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఈ పనులను ప్రారంభించనున్నారు.

యూపీహెచ్‌సీతో అందుబాటులో వైద్యం

వార్డు పరిధిలో యూపీహెచ్‌సీ ఏర్పాటుతో మా ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్యం అందుతోంది. రోగికి పెద్ద సమస్య ఉన్నట్లయితే ఇక్కడ వైద్యులు పెద్దాస్పత్రికి దగ్గరుండి మరీ రిఫర్ చేసి, మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌గా వైద్యం పొందుతున్న రోజుల్లో రోగికి నగదు కూడా అందిస్తున్నారు.

– సరస్వతి, గవరపాలెం

సొంతింటి కల నెరవేరింది

కోడూరు సర్వే నెం.1లో జగనన్న గృహం నిర్మించి ఇస్తున్నారు. సుమారు 75 శాతం పనులు పూర్తయ్యాయి. మరో నెల రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తయి, మాకు అప్పగిస్తామని అధికారులుచెప్పారు. నా సొంతింటి కల నెరవేర్చిన జగనన్న మేలు ఎప్పటికీ మర్చిపోలేం. 15 ఏళ్ల తర్వాత మా సొంతింటి కల నెరవేరింది.

– అనూరాధ, గవరపాలెం

అధికారుల తీరు ఆక్షేపణీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

- మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు
- అనకాపల్లి తహసీల్దార్‌పై కలెక్టర్ ఫిర్యాదు–ఎంపీపీ సూరిబాబు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

అనకాపల్లి: మండలంలో ప్రజల సమస్యలపై దృష్టి సారించాల్సిన అధికారులు మండల సమావేశాలకు హాజరుకాకపోవడం ఆక్షేపణీయమని ఎంపీ గొర్లి సూరిబాబు అన్నారు. అనకాపల్లి తహసీల్దార్ మూడుసార్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరవడంపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పీవీఎం మోహన్‌కుమార్ అధ్యక్షత బుధవారం నిర్వహించిన 12వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సమావేశాలకు డుమ్మా కొట్టిన వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు(డీడీ) మెమోలు జారీచేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ప్రజా సమస్యలపై వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లతో జరిగే సమావేశాలకు హాజరుకాకపోవడం సరికాదన్నారు. ఇలా చేస్తే ప్రజల సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. 32 మంది పంచాయతీ కార్యదర్శులుల్లో కనీసం 10 మంది కూడా హాజరుకాలేదన్నారు. గ్రామాల్లో విద్యుత్ బిల్లు చెల్లించిన పంచాయతీలకు విద్యుత్‌ను ఎందుకు నిలుపుదల చేశారో వివరణ ఇవ్వాలన్నారు. తాగునీరు, విద్యుత్, వైద్యశాఖ, రహదారులు, వ్యవసాయ శాఖల అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు తెలిపారు. మామిడిపాలెం, పాపయ్యసంతపాలెంలో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. తగరంపూడి, సీతానగరం లైన్‌మెన్లు విధులు సక్రమంగా నిర్వహించట్లేదని, త్వరలో మార్పులు చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ కోసం విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, విత్తనాలను పరీక్షలకు పంపిస్తున్నట్లు తెలిపారు. మరో 15–20 రోజుల్లో మండల కేంద్రాల ద్వారా ఆర్బీకేలకు విత్తనాలు చేరతాయన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బీశెట్టి వరాహసత్యవతి, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకళ, అయితా రాము, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల కల్యాణం



గౌరీపరమేశ్వరుల కల్యాణం చేస్తున్న అర్చకులు చక్రవర్తి



అన్నసమారాధన కార్యక్రమం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి గౌరీపరమేశ్వరులకు ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మధ్యాహ్నం 10 వేల మందికి అన్నసమారాధన జరిపారు. రాత్రి 7 గంటలకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి గోపఅప్పలాచార్యులు(చక్రవర్తి) ఆధ్వర్యంలో దంపతులతో గౌరీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి, స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ, ఆలయ నిర్వహణ కమిటీ, అన్నసమారాధన కమిటీ, వేల్పులవీధి పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేడు ఉత్సవాలకు అంకురార్పణ
- ముస్తాబైన పెందుర్తి వెంకటాద్రి



పెందుర్తి: బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు పెందుర్తి వెంకటాద్రి సిద్ధమైంది. శ్రీనివాసుడు పద్మావతి అమ్మవారిని వివాహమాడేందుకు భూమి మీద అడుగిడిన పవిత్ర రోజు వైశాఖ శుద్ధ దశమి నాడు ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. పెందుర్తి వెంకటాద్రి నిర్మాణానికి కూడా వైశాఖ శుద్ధ దశమి నాడే తొలి అడుగు పడింది. ఈ క్రమంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించి వెంకటాద్రిపై వైశాఖ శుద్ధ దశమి(శనివారం) నాడు కల్యాణం చేస్తారు. ఈ క్రమంలో వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు విష్వక్సేనపూజ, అంకురార్పణ జరుగుతుంది. రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీసులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. భక్తులంతా తరలిరావాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాలువలు శుభ్రం చేయాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న యూత్ సభ్యులు

పరవాడ: వెన్నలపాలెం గ్రామంలోని హనుమాన్‌నగర్‌లో కాలువలు అధ్వానంగా ఉన్నాయని.. చెత్త కుప్పలు తొలగించాలని యూత్ సభ్యులు పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో వాటర్ ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదని, కాలువలు చెత్త చెదారాలతో నిండి మురుగునీరు పారడం లేదని కార్యదర్శి వరలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీలో ఏర్పాటు చేసిన వీధి లైట్లు మరమ్మతులతో మూలుగుతున్నాయని ఫలితంగా రాత్రి సమయంలో కాలనీ వాసులు అంధకారంలో అలమటించాల్సి వస్తుందని వివరించారు. వెంటనే వీధి లైట్లకు ఏర్పాటు చేయాలని కోరారు. కాలువలు, వాటర్ ట్యాంకు, ఇతర సమస్యలను రెండు రోజుల్లోగా పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి యూత్ సభ్యులకు హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో యూత్ సభ్యులు సుదీర్, రవితేజ, గిరి, శ్రీను, హరి, హేమంత్, పవన్‌సాయి, కృష్ణ, అప్పు, మోహన్ దుర్గా, త్రినాథ్ ఉన్నారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు



దేవరాపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై గ్రామాల్లో బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అర్ధరాత్రి వరకు పోలింగ్ జరగడంతో పాటు అత్యధికంగా పోలింగ్ శాతం నమోదు కావడంతో గెలుపు అవకాశాలను అంచనాలు వేస్తూ బెట్టింగ్ వేస్తున్నారు. ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు తటస్థులు సైతం పందాలు కాస్తున్నారు. గ్రామాల్లో జరిగిన పోలింగ్ సరళిని అంచనా వేస్తూ, ఇతర గ్రామాల్లో పోలింగ్ సరళిని సైతం తమ అనుచరులు, ఇతర మార్గాల ద్వారా కనుక్కొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వెరసి మాడుగుల నియోజకవర్గంలో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. దేవరాపల్లి మండలంలో ఎక్కువ మంది పందాలు కాస్తున్నారు.

రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు తమ ఎంపీ, ఎమ్మెల్యేలు గెలుపొందుతారని ప్రధాన పార్టీలకు చెందిన వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయుకులు, కార్యకర్తలు ఇప్పటికే లక్షల్లో బెట్టింగ్‌లకు పాల్పడగా మరికొంత మంది ఒకటో తేదీన వచ్చే ఎగ్జిట్‌పోల్స్ ఆధారంగా బెట్టింగ్‌లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే అత్యధికంగా నమోదైన పోలింగ్ శాతం ఆధారంగా రాష్ట్రంలో మళ్లీ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అధికశాతం మంది బెట్టింగ్‌లు వేయడం కనిపిస్తోంది.

నాతవరం మండలంపై...

నాతవరం: నర్సీపట్నం నియోజకవర్గంలో నాతవరం కీలకంగా మారింది. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో పెట్ల ఉమా శంకర్ గణేష్ 24,500 మెజార్టీతో విజయం సాధించారు. నాతవరం మండలంలో 8,341, నర్సీపట్నం మున్సిపాలిటీలో 4,581, నర్సీపట్నం రూరల్‌లో 1,873, మాకవరపాలెం మండలంలో 3,657 ఓట్ల మెజార్టీ లభించింది. నాతవరం మండలంలోనే అధిక మెజార్టీ లభించడంతో ఈ మండలంపైనే అందరి దృష్టి పడింది. ఈ నాతవరం మండలంలో మెజార్టీ సాధించేందుకు ప్రధాన పార్టీలు పోటీపడ్డాయి. నాతవరం ఓటర్ల తీర్పు ఆధారంగా ఎమ్మెల్యే అభ్యర్థి గెలుస్తారని పందేం రాయుళ్లు బెట్టింగ్‌లు కాసేస్తున్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పాత వాలాబు విద్యార్థుల ప్రతిభ



గురుకుల విద్యాలయాల్లో సీట్లు సాధించిన పాత వాలాబు విద్యార్థులతో హెచ్‌ఎం కె. దండునాయుడు

దేవరాపల్లి: గురుకుల విద్యాలయంలో 5వ తరగతి ప్రవేశ పరీక్షల్లో మండలంలోని పాత వాలాబు ప్రాథమిక పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థులు సత్తా చాటారు. వివిధ గురుకులాల్లో సీట్లు సాధించడం కోసం పది మంది విద్యార్థినీవిద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారు. వీరిలో ఏడుగురు విద్యార్థులు మంచి మార్కులతో సీట్లు సాధించి పాఠశాలకు మండల స్థాయిలో మంచి పేరు తీసుకువచ్చారు. సీట్లు సాధించిన వారిలో జె.కార్తీక్, పి.నవీన్, సీహెచ్. లోహిత్, డి.భగవాన్ సంతోష్, కె. చాందిని, పి.కోమలి, టి.అచ్చియ్యమ్మ ఉన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూండ్రపు దండునాయుడు తెలిపారు. సింహాచలంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయం, భీమిలిలోని ఏపీఆర్ బాలికల పాఠశాల, గుంటూరు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించినట్టు చెప్పారు.

80 మందికి నేత్ర వైద్య పరీక్షలు



చుక్కపల్లిలో శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

చీడికాడ: మండలంలోని చుక్కపల్లిలో బుధవారం శంకర ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 84 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 40 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు క్యాంప్ డిప్యూటీ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపా రు. ఈ క్యాంపులో సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ,ఎంపీటీసీ సుంకర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో మాడుగుల విద్యార్థిని ప్రతిభ



యాలంగి నూతన

మాడుగుల: సీబీఎస్ ఈ పదవ తరగతి ఫలితాల్లో మాడుగుల విద్యార్థిని ప్రతిభ చూపింది. యాలంగి నూతన 92 శాతం మార్కులు సాధించింది. నూతన మల్కా పురం కేంద్రియ విద్యాలయంలో చదువుతోంది. తండ్రి యాలంగి బాలకృష్ణ గంగవరం పోర్టులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. తల్లి పుష్పలత గృహిణి కాగా, ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసి, ఎంబీబీఎస్ చేయడమే తన జీవిత లక్ష్యమని నూతన తెలిపింది.

సైనిక్ స్కూల్‌కు కోడూరు విద్యార్థి ఎంపిక



తనూజ్‌కుమార్

మాకవరపాలెం: మండలంలోని జి.కోడూరుకు చెందిన విద్యార్థి సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. గ్రామంలోని ఎస్‌జీకె స్కూల్లో చదువుతున్న గంగిరెడ్ల తనూజ్‌కుమార్ సైనిక్ స్కూల్లో ఆరోతరగతి ప్రవేశానికి పరీక్ష రాశాడు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి రాజస్థాన్‌లోని గంగానగర్ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడని పాఠశాల కరస్పాండెంట్ వీరప్రకాశ్ బుధవా రం తెలిపారు. తనూజ్‌కుమార్‌ను తల్లిదండ్రు లతో పాటు స్థానికులు అభినందించారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్టాపన వార్షికోత్సవం



వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు, అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

రోలుగుంట: మండలంలోని కొవ్వూరులో సిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్టాపన 22వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఈ కార్య క్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు బంటు రాజు, ఎస్.రామారావు, జి.రాము, శ్రీనివాసరావు, బంటు రాజుబాబు, కె.ఈశ్వరావు, రాజారావు, శ్రీనివాసరావు తదితర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమం నిర్వహించారు.